


గుల్జార్‌హౌస్‌లో జరిగిన అగ్ని ప్రమాదం స్థలాన్ని సందర్శిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

## అగ్ని ప్రమాదం ఘటనా స్థలాన్ని సందర్శించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు

**చార్మినార్,మే 18 ప్రభాతవార్త :**

హైదరాబాద్ పాతబస్తీ గుల్జారాహౌస్‌లో ఆదివారం ఉదయం జరిగిన భారీ అగ్ని ప్రమాదంలో 17 మంది మార్వాడీలు మృతి చెందిన విషయం విధితమే. ఆదివారం మధ్యాహ్నం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలు మేరకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర్ రాజ నర్సింహ, రాజ్యసభ సభ్యులు ఎం.అనిల్ కుమార్, రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్‌లు కలిసి అగ్ని ప్రమాదం జరిగిన గుల్జారాహౌస్‌లోని ప్రహ్లాద్ మోదీ నివాసాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మృతులకు ఒక్కక్కరికి ఐదు లక్షల రూపాయల పరిహారం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం తరుపున ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.



హైదరాబాద్ వార్త



# ఇరుకుదారి...మృత్యుదారి

### గుల్జార్‌హౌస్ ప్రమాదంలో బాధితుల ఆర్తనాదాలు.. సన్నటిసందులో ఉండే మెట్లదారితోనే రక్షణ చర్యలు..



**హైదరాబాద్, మే 18 ప్రభాతవార్త**

పాతబస్తీలో ఘోర విషాదం చోటుచేసుకుంది. చార్మినార్‌కు సమీపంలోని గుల్జార్‌హౌస్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. కింద షాపులు.. పైన ఇల్లు.. రావడానికీ పోవడానికీ ఒకేదారి. ఎన్నో ఏళ్లుగా అక్కడే వ్యాపారం. అక్కడే నివాసం. ఇన్నేళ్లూ ఏమీ జరగలేదు. ఎప్పుడూ ఎవరూ ఎలాంటి ప్రమాదాన్నీ శంకించలేదు. కానీ అనుకోని దుర్ఘటన 17 నిండు ప్రాణాలను బలితీసుకుంది. మరికొందరిని ఆస్పత్రిపాలు చేసింది. ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలను శోకసముద్రంలో ముంచేసింది. ప్రమాదంతో భవనంలో ఉన్న పలువురు ఊపిరి ఆడక స్పృహ కోల్పోయారు. దీంతో వారిని ఉస్మానియా, యశోద(మలక్‌పేట), డీఆర్డీవో ఆపోలో ఆస్పత్రులకు తలరించారు. కొందరు ఘటనా స్థలంలో.. మరికొందరు ఆస్పత్రికి తరలించే మార్గ మధ్యలో.. మరికొందరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ మృతిచెందారు. గుల్జార్‌హౌస్ పరిసరాల్లో దట్టంగా పొగ కమ్ముకోవడంతో శ్వాస తీసుకునేందుకు స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

**ఇంట్లోకి చేరే మార్గంలేక..తలుపులు పగులగొట్టి..**

తీవ్ర విషాదాన్ని నింపిన ఈ ప్రమాదానికి గురైన ఈ భవనం మొదటి అంతస్తులో వ్యాపారి కుటుంబం నివాసముంటోంది. గ్రౌండ్ ఫ్లోర్‌లో నగల దుకాణం నిర్వహిస్తున్నారు. వేసవి సెలవుల సందర్భంగా వ్యాపారివద్దకు బంధువులు వచ్చారు. మంటలు చెలరేగడంతో ఇంట్లో పొగ కమ్ముకుంది. దీంతో ఊపిరాడక పలువురు స్పృహ తప్పి పడిపోయారు. ఘటనాస్థలికి చేరుకున్న సహాయ బృందాలు మంటలు ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. ఇంటిలో చెక్కతో చేసిన ప్యానెళ్ల వల్లే మంటలు వ్యాపించాయని, విద్యుదాఘాతంతో చెక్క మొత్తం కాలి మంటలు వచ్చాయని అగ్నిమాపక అధికారులు పేర్కొంటున్నారు. ఇంట్లోకి పొగ చేరడం.. ఒకే చిన్న మెట్ల మార్గం ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. నిచ్చెనలతో మొదటి అంతస్తులోకి అగ్నిమాపక సిబ్బంది వెళ్లారు. ఇంట్లోకి చేరే మార్గం లేక తలుపులు పగులగొట్టి స్పృహతప్పి ఉన్న పలువురిని బయటకు తీసుకొచ్చారు. అనంతరం వారిని అంబులెన్స్‌లో వివిధ ఆస్పత్రులకు తరలించారు. వారిలో కొందరు మార్గమధ్యలోనే మృతిచెందారు.

**నిద్రలో ఉండగా మంటలు..**

చార్మినార్ అగ్ని ప్రమాదానికి అసలు కారణం ఏంటి? ప్రమాదం కచ్చితంగా ఎన్ని గంటలకు జరిగిందనేదానిపై భిన్నవాదనలు వినిపిస్తున్నాయి. ఉదయం 5.15 గంటలు–6 గంటల ప్రాంతంలో జరిగిందీ ఘటన. అంతా గాఢనిద్రలో ఉండగా మంటలు చుట్టుముట్టాయి. కిందున్న జ్యూయలరీ షాప్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ఏసీ కంప్రెషర్ పేలటంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయని స్థానికులు చెబుతున్నారు. అయితే ఏసీ కంప్రెసర్ పేలడం కారణంగానే ప్రమాదం జరిగినప్పటికీ పోలీసులు మరిన్ని కోణాలు విచారిస్తున్నారు. ప్రమాదానికి కంప్రెసర్ పేలడమే కారణమా? లేదా ఇంకేదైనా ఉందా అనేది దానిపై ఆరా తీస్తున్నారు. ప్రమాదం జరుగగానే వెనుకున్న ఇళ్లకు కూడా పొగ కమ్మేసింది. ఇంట్లోకి వెళ్లేందుకు అగ్నిమాపక సిబ్బంది చాలా ప్రయాస పడాల్సి వచ్చింది. దీంతో చార్మినార్ సమీపంలోని గుల్జార్ హౌస్‌లో జరిగిన అగ్నిప్రమాదం తీరని విషాదాన్ని మిగిల్చింది. స్పాట్‌లో ముగ్గురు, ఆస్పత్రికి తరలించాక 14మంది ఇలా మొత్తం 17 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇంకొందరు చికిత్స పొందుతున్నారు. మృతుల్లో ముగ్గురు మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. భవనంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో జ్యూయలరీ షాప్ నిర్వహిస్తున్నాడు వ్యాపారి. ఫస్ట్‌ఫ్లోర్‌లో కుటుంబం ఉంటోంది. వేసవి సెలవులకు వచ్చిన బంధువులు ప్రమాద సమయంలో ఇంట్లోనే ఉన్నారు. నిచ్చెనల సాయంతో మొదటి అంతస్తుకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది తలుపులు పగలగొట్టి స్పృహకోల్పోయి ఉన్న కొందరిని అతి కష్టంమీద బయటికి తెచ్చారు.



ఉస్మానియా మార్చురీ వద్ద డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర్ నర్సింహా, పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి, సిపి సివి ఆనంద్ తదితరులు

**ప్రాణాలు తీసిన మృత్యు దారి...**

ఒక బిల్డింగ్‌లో ప్రమాదం జరిగితే ఇన్ని ప్రాణాలు బలవ్వాల్సిందేనా.. బయటకు వచ్చే సరైన మార్గం లేకే వారంతా ప్రాణాలు కోల్పోయారా అంటే అవుననే అంటున్నాయి అక్కడి పరిస్థితులు.. ఆ బిల్డింగ్‌కు వెళ్లడానికి ఒక సొరంగంనుంచి వెళ్లినట్లు ఉంటుంది మార్గం. జీ ప్లస్ 2 బిల్డింగ్‌లో పైకి ఎక్కడానికి మెట్లు చాలా ఇరుకుగా ఉంటాయని పోలీసులు తెలిపారు. ఫైర్ డిపార్ట్మెంట్ అధికారిక ప్రకటన ప్రకారం.. ఉదయం 06:16 గంటలకు చార్మినార్‌లోని గుల్జార్ హౌస్ చౌరస్తాలోని బిప్లస్ 2 భవనంలో మంటలు చెలరేగాయని సమాచారం వచ్చింది.. మొఘల్‌పురా ఫైర్ సిబ్బంది అగ్ని ప్రమాదం జరిగిన ప్రదేశానికి చేరుకున్నారు. భవనం బిప్లస్ 2 అంతస్తులను కలిగి ఉంది.. గ్రౌండ్ ఫ్లోర్‌లో చెలరేగిన మంటలు పైఅంతస్తు లకు వ్యాపించాయి.

అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్లు ఒకేసారి జరిగాయి. కిటికీ లో నుంచి నలుగురిని బయటకు తీసుకొచ్చారు. భవనం గోడ పగలగొట్టి లోపలికి వెళ్లారు ఫైర్ ఫైటర్స్. అప్పటికే 17 మంది పొగతో ఊపిరా డక ఆపస్మారక స్థితి లోకి వెళ్లారు. స్పాట్‌లో ముగ్గురు.. ఆస్పత్రుల్లో 14 మంది మృతి చెందారు. అత్యంత ఇరుకైన దారే మృతులు పెరగడానికి కారణంగా మారింది.

**పోస్ట్‌మార్టం పూర్తి..**
**మృతదేహాలు బంధువులకు అప్పగింత..**

చార్మినర్ సమీపంలోని గుల్జార్ హౌస్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మృతి చెందిన వారికి ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టుమార్టం పూర్తయింది. అనంతరం ఆయా మృతదేహాలను బంధువులకు వైద్యులు అప్పగించారు. మృతదేహాల అప్పగింత కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తోపాటు జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ స్వయంగా పర్యవేక్షించారు. గుల్జార్ హౌస్ అగ్నిప్రమాదంలో మరణించిన వారిలో పలువురు హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన వారు ఉన్నారు.

ఈ నేపథ్యంలో మృతదేహాలను అత్తాపూర్ సన్ రైజ్ విల్లాస్‌కు, బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 12కి రెండు, సనత్ నగర్ స్వామి థియేటర్ బ్యాక్ సైడ్ ఒకటి, మోతి నగర్‌లోని రాజీవ్‌నగర్‌కి మూడు మృతదేహాలు తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకో గానే..ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ ఆసుపత్రికి చేరుకొని బాధితులను పరామర్శించారు.






# దడపుట్టిస్తున్న వరుస ఉదంతాలు

### మీర్‌చౌక్‌లో ఘోర అగ్నిప్రమాదం హృదయవిదారకం..17 మంది మృతి నిర్వహణ లోపం వల్లే షార్ట్‌సర్క్యూట్‌లు అత్యధిక అగ్ని ప్రమాదాలు

**హైదరాబాద్, మే 18 ప్రభాతవార్త :** పాతబస్తీ చార్మినార్ వద్ద 17 మందిని పొట్టన పెట్టుకుంది. బోయగూడలోని తుక్కు దుకాణం 11 మందిని ఉసురు తీసింది. రూబీ లాడ్జి 8 మందిని బలితీసుకుంది. స్వప్నలోక్ కాంప్లెక్స్‌లో 6 చనిపోయారు. మినిస్టర్ రోడ్‌లోని డెక్కన్ కార్పొరేట్ భవనంలో ముగ్గురు మృతి చెందారు. ఇలా నగరంలో నిత్యం ఏదో ఒకచోట అగ్ని ప్రమాదవం వెలుగు చూస్తూనే ఉంది. ఎవరో ఒకరు మంటల్లో ఊపిరిఆడక.. కాలిబూడిదవుతూనేఉన్నారు. నగరంలో ఇటీవల కాలంలో వరుసగా చోటుచేసుకుంటున్న అగ్నిప్రమాదాలు దడ పుట్టిస్తున్నాయి. పాతబస్తీలో జరిగిన భారీ అగ్నిప్రమాదం మరింత విషాదాన్ని నింపింది. ఈ దుర్ఘటనలో మృతి చెందినవారి సంఖ్య 17కు చేరుకుంది. ఈ ఘటన ఒకేసారి అనేక కుటుంబాల్లో తీరని విషాదాన్ని నింపింది. ఇలా నిత్యం ఏదో ఒక చోట అగ్ని ప్రమాదం వెలుగు చూస్తూనే ఉంది. ఎవరో ఒకరు కాలిబూడిదవుతూనే ఉన్నారు. పొట్ట చేతపట్టుకుని ఇతర రాష్ట్రాలు, తెలంగాణ జిల్లాల నుంచి ఇక్కడికి వలస వచ్చిన కార్మికులు, కూలీలు ఈ అగ్ని ప్రమాదాల్లో చిక్కుకుని మృత్యువాతపడుతుండటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతుంది. ఇంకెన్ని ఘటనలు వెలుగు చూడాలి? ఇంకెంత మంది బతుకులు కూలాలి? అంటూ సిటీజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అగ్ని ప్రమాదాలకు కారణాల్లో కాల్చిపారేసిన బీడీ, సిగరెట్లు మొదటి స్థానంలో ఉండగా, షార్ట్ సర్క్యూట్‌లు రెండో స్థానంలో ఉంటున్నాయి.

**మచ్చుకు కొన్ని ప్రమాదాలు..**

–ఉస్మాన్‌గంజ్‌లోని కార్తికేయ లాడ్జి గ్రౌండ్‌ఫ్లోర్‌లో శాంతి ఫైర్‌వర్క్స్ ఉండేది. అప్పట్లో అక్కడ పెద్ద మొత్తంలో బాణసంచాను నిల్వ చేశారు. 2002లో అక్టోబర్ 23న తెల్లవారు జామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ చోటు చేసుకుంది. అప్పటికే లాడ్జీలో 32 మంది నిద్రలో ఉండగా, వీరిలో 12 మంది అగ్నికీలల్లో చిక్కుకుని మృత్యువాతపడ్డారు.

–సికింద్రాబాద్ రూబీ లాడ్జీలో సెల్లార్‌లో ఉన్న ఎలక్ట్రికల్ బైక్స్ షోరూమ్‌లో షార్ట్‌సర్క్యూట్ తలెత్తి పైన లాడ్జీలో ఉన్న 12 మంది మృతి చెందగా, మరో పది మంది క్షతగాత్రులయ్యారు.

–2018లో ఎల్బీనగర్‌లోని షైన్ చిల్డ్రన్స్ ఆస్పత్రిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఐసీయూలో చికిత్స పొందుతున్న ఐదుగురు చిన్నారులు కాలిబూడిదయ్యారు.

–2022 మార్చి 23న న్యూబోయగూడలోని శ్రావణ్ ట్రేడర్స్ పేరుతో ఉన్న ఓ స్క్రాప్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం వెలుగు చూసింది. 11 మంది మృత్యువాతపడానడరు.

–డెక్కన్ మాల్‌లో వెలుగు చూసిన అగ్నిప్రమాదంలో ముగ్గురు చనిపోయారు. ఈ ఘటన తర్వాత అధికారులు ఆగమేఘాల మీద టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశారు. రెండు మీటింగ్‌లకు మాత్రమే కమిటీ పరిమితమైంది.

–2017 ఫిబ్రవరి 24న అత్తాపూర్‌లోని పిల్లర్ నెం. 253 సమీపంలో ఉన్న కూలర్ల తయారీ పరిశ్రమలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఒరిస్సాకు చెందిన ఆరుగురు మృతి చెందారు.

–2012 నవంబర్ 24న పుప్పాల్‌గూడలోని బాబానివాస్ అపార్టుమెంట్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. ఈ గటనలో ఎనిమిది మంది చనిపోయారు.

–2006 అక్టోబరు 21న సోమాజిగూడలోని మీన జ్యూవెలర్స్ భవనం సెల్లార్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో పెయింటింగ్ పనులకు వచ్చిన ముగ్గురు చనిపోయారు.

–పురాతన సికింద్రాబాద్ క్లబ్ సహా అనురాథ టింబర్ డిపోల్లో వెలుగు చూసిన అగ్నిప్రమాదాలకు ఈ షార్ట్ సర్క్యూట్లే కారణమని తెలిసింది. అయితే ఆయా ఘటనల్లో ప్రాణనష్టం లేకపోయినప్పటికీ భారీగా ఆస్తినష్టం వాటిల్లింది.

**అవసరం మేరకులేని ఫైర్ స్టేషన్లు..**

ఏటా అగ్నిప్రమాదాలు వేల సంఖ్యలో, ఆస్తినష్టం వందల కోట్లలో, ప్రాణనష్టం పదుల సంఖ్యలో ఉంటోంది. అయితే ఈ మేరకు అవసరమైన సంఖ్యలో అగ్నిమాపక కేంద్రాలు లేవు. సిబ్బంది, శకటాలు సహా ఇతర మౌలిక వసతులూ లేవు. జనాభా విస్తీర్ణం ప్రాతిపదికన తీసుకున్నా హైదరాబాద్ మహానగరంలోనే 100కు పైగా అగ్నిమాపక కేంద్రాలు, ఒక్కో కేంద్రంలో కనీసం మూడు శకటాలు, కనిష్టంగా 15 మంది సిబ్బంది అవసరం. అయితే ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అగ్నిమాపక కేంద్రాల సంఖ్య 110 దాటట్లేదు. వీటికి తోడు మరో 20 వరకు ఔట్‌సోర్సింగ్ పోస్టులు ఉన్నాయి. వీటిలోనూ 95శాతం కేంద్రాల్లో సాధారణ ఫైర్ ఇంజన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఈ కారణంగానే బహుళ అంతస్తుల భవనాలు, భారీ సముదాయాలు, పరిశ్రమలు తదితరాల్లో జరిగే అగ్ని ప్రమాదాలను అదుపు చేయడం కష్టసాధ్యం అవుతోంది.

**పటిష్ఠ చట్టం లేదు...**

ఫైర్‌సేఫ్టీ నిబంధనలు పట్టించుకోని ఘటన యాజమాన్యాలపై చర్యలు తీసుకునేందుకు అగ్నిమాపక, విపత్తు నిర్వహణ శాఖకు ఉన్న ఒకే ఒక్క ఆయుదం ఏపి ఫైర్ సర్వీసెస్ యాక్ట్. 1999లో రూపొందించిన ఈ కోరలు లేని చట్టమే ఇప్పటికీ ఉండటం గమనార్హం. అయితే ఈ విభాగం కేసు నమోదు చేసినప్పటికీ నోటీసుల జారీ మినహా అరెస్టులకు ఆస్కారం లేదు. కేసు కూడా సివిల్ కోర్టులో విచారణ జరుగుతుంది. దాదాపు 90శాతం ఉల్లంఘనలకు జరిమానా, మిగిలిన వాటిలో కనిష్ట శిక్ష 3 నెలలు మాత్రమే. అగ్నిమాపక శాఖ అధికారులు 2014 నుంచి ఇప్పటి వరకు నమోదు చేసిన కేసుల్లో ఒక్క దాంట్లోనూ శిక్ష పడకపోవడం గమనార్హం. సిబ్బంది లేమి తనిఖీలకు అడ్డంకిగా మారింది.



సంఘటనా స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న కిషన్‌రెడ్డి

## బాధితులకు కేంద్ర ప్రభుత్వం సహాయం

### కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**చార్మినార్,మే 18 ప్రభాతవార్త :** కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆదివారం ఉదయం గుల్జారాహౌస్‌లో జరిగిన అగ్ని ప్రమాదం జరిగిన ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహాయక చర్యల్లో అగ్నిమాపక సిబ్బంది ఆలస్యం చేశారని బాధితులు ఆరోపిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం అగ్ని మాప సిబ్బందికి మంచి పరికరాలు, శిక్షణ ఇవ్వలసి ఉందని ఇయన తెలియజేశారు. ఇంలాంటి సంఘటనలు మళ్లీ పునారావృత్తం కాకుంవడ ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవలపిన అవసరం ఉందని బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం తరుపున సహాయం అందిస్తామని ఆయన తెలిపారు. విద్యుత్ ఘాతం వల్లనే గుల్జారాహౌస్‌లో అగ్ని ప్రమాదం : అగ్ని మాపక శాక డిజి నాగిరెడ్డి చార్మినార్, మే 18 ప్రభాతవార్త : హైదరాబాద్ పాతబస్తీ గుల్జారాహౌస్‌లోని ఓ భవనంలో ఆదివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్లనే అగ్ని ప్రమాదం జరిగిందని అగ్ని మాపక శాఖ డిజి నాగిరెడ్డి తెలిపారు. షార్ట్ సర్క్యూట్ వల్ల ప్యానల్ చెక్క కాలిపోయి మంటలు వచ్చాయని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని మాపక సిబ్బంది సకాలంలో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారని, ఈ విషయంలో వస్తున్న ఆరోపణలు నిజం కాదని తెలిపారు. పదకుండు అగ్ని మాపక కేంద్రాలు, 17 మంది ఫైర్ అధికారులు, డెబ్బైమంది సిబ్బంది పాల్గొన్నారని ఆయన తెలిపారు.

**బాధితులను ఆదుకోవాలి : ఎంపి అసదుద్దీన్ ఓవైసీ**

**చార్మినార్,మే 18 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ గుల్జారాహౌస్‌లో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాద ఘటన అత్యంత విచారకరమని ఎంఐఎం అధ్యక్షులు, హైరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. ఎంపి అసదుద్దీన్ ఓవైసీ ఆదివారం గుల్జారాహౌస్‌లోని అగ్ని ప్రమాద ఘటన స్థలాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగల వ్యాపారికి చెందిన కుటుంబ సభ్యులు అగ్ని ప్రమాదంలో మృతి చెందడం బాధాకరమని, మృతుల కుటుంబాలకు అసదుద్దీన్ ఓవైసీ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. భవిష్యతులు ఇలాంటి సంఘటనలు జరగకుండ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన తెలియజేశారు. బాధితులను అన్ని విధాల డాదుకోవాలని ఆయన తెలిపారు. కాగా మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, వ్యాపారి నవల్ కిశోర్ అగర్వాల్‌తో పాటు పలువురు ఘటనా స్థలాన్ని సందర్శించి మృతుల కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు.

